కథానిక

# నాట్యరాణి

సీతారామ్

ఆ అమ్మాయికి పేరు వేరే పెట్టలేదుట. చిన్నప్పటినుండీ ఏపాటవిన్నా, పాడినా నాట్యం చేసేదిట. సినిమాలలో తాను చూసిన నాట్యాలన్నీ ఇంటిదగ్గర చేసేదిట. ఆమెలో అందరూ మెచ్చుకొనేది తు, చ తప్పకుండ తను చూసిన దాన్ని మళ్ళీ అభినయించడమే. అలాగే ఎదిగింది ఆ అమ్మాయి. ఎన్నోసార్లు ఆమెకి పేరు పెట్టాలని అందరూ ప్రయత్నించారు. చివరకి ఆ నోట ఈ నోటా పడి "నాట్య రాణి" అయింది ఆ పేరు.

నాట్యరాణి తల్లితండ్రులది అతి సామాన్య సంసారం. అయినా, తన కూతురి విద్యావిశేషం వల్ల ధనం సంపాదించాలనే ఉబలాటం తండ్రికి లేదు. ఎన్నో పరిషత్తుల యజమానుల కోరికలని కాదనవలసి వచ్చింది ఆయన. పోనీ, ఊరికేనే వచ్చి నాట్యప్రదర్శనా లిమ్మన్నారు. కాని సంప్రదాయ సిద్ధమైన వంశంలోకి ఈ నాట్యం ప్రవేశపెట్టి, అమ్మాయిని బజారులోకి పంపించడం ఆయనకి నచ్చలేదు. అమ్మాయికి సభలలోను, నలుగురిలోను వేదిక అలంకరించి గంతెయ్యాలని ఉన్నా, తండ్రిగారి అభిమతం ప్రకారం తన కోరికను సంబాళించుకొని ఉండేది.

శర్మకి ప్రత్యేకంగా నాట్యం అంటే అభిరుచి లేకపోయినా, లలితకళలంటే మహాభిమానం. తను కూడా ఒక కవినే అనుకొంటాడు. ఇతరులలోని గుణాలని కనిపెట్టి అవి మంచివని తనకి తోస్తే, వాటికి అతనిచ్చే గౌరవం మరొకరి చేతగాదు. తన అభిమానులు కొందరు 'రాణి'ని గురించి చెపుతుంటే ఇదివరకే విని ఉన్నాడు.

పెళ్ళిచూపులకి వచ్చిన శర్మ చాలా ముచ్చటగా ఉన్నాడు. విశ్వవిద్యాలయంలో పరిశోధన చేస్తున్నాడు. ఉత్తమమైన స్థానాన్ని పొందేందుకు. చక్కని పాటపాడి వినిపించింది రాణి అతనికి. పాడేటప్పుడు (కూర్చుని) లేచి నాట్యం చేద్దామా అనిపించింది రాణికి. పండువంటి ఛాయగల శర్మ కూడా రాణికి నచ్చినట్లే ఉన్నాడు. అతనిలో ఏదో విశ్వసనీయమైన భావం ఉన్నట్లుగా ఆమెకి తోచింది. ఆమె శరీరం ఆహ్లాద పులకితమైంది. విడిచిన రేకుల్లాంటి తన కళ్లు తమ పూర్తి వైశాల్యాన్ని మీరిపోతున్నాయి. "ఇంకొక పాట పాడనా?" అంది. శర్మకి ఎంతో 'హాయి' అనిపించింది.

"అమ్మాయికి నాట్యమంటే చాలా ప్రాణం" అన్నాడు తండ్రి.

"ఆసంగతి మేం ముందే విన్నాం. తప్పకుండా ఆ అమ్మాయి మనోరథాల్ని నెరవేరుస్తాం" అన్నాడు శర్మ.

ఎగిరి గంతేసింది రాణి. శర్మ ఉదారస్వభావమనే వేదికమీద తాను నిత్యమూ తన మనోరథాల్ని నాట్యమాడించవచ్చును. ఇంకేం? రాణీ! నీ రొట్టె పేరుకొన్న నేతిలోనే పడింది, అన్నారు ఆమె స్నేహితులు. అతడు ఉదయమే లేబొరేటరీకి వెళ్లిపోతాడు. రాత్రి తొమ్మిది దాటాక కాని మళ్లీ యిల్లు చేరుకోడు. వచ్చిన వెంటనే గృహిణి ఉపచారాలకి సేద దీరుతాడు. అన్నం తింటుంటే, ఒక మలయానిలంవంటి పాట విసరుతుంది. వేడినీళ్ల స్నానం చేసిన అతని ఒంటికి వీచే చిరుగాలి, ఆవిడ పాటకలిసి తీరని ఉపచారాలు చేస్తాయి.

"మరి, నా నాట్యం ఇలా ఉండిపోవలసిందేనా?"

"అంటే?"

"దాన్ని ఇంకా నేర్చుకొని..."

"ప్రదర్శించాలనా నీ కోరిక?... నువ్వు నేర్చుకో రాణీ, నీకు అన్ని అవకాశాలు అందుకు కల్పిస్తాను. కాని ప్రదర్శించడంలో నేను నీతో ఏకీభవించలేను."

"మీరు అంగీకరిస్తే చాలు."

"కళ్ళప్పగించి మాసే "ఆతురుల"కి మాత్రం నీ నాట్య మెుక్కటేనా తృప్తినిచ్చేది?"

"మీరు అసూయపడతారంటే."

"అసూయ కాదు రాణీ! నిజం. నువ్వేదో గొప్పగా నాట్యమాడా ననుకొంటావు. కాని నీ ప్రదర్శనం లేకెత్తించే సమస్యల్ని సాధించ లేం. అందుకని-"

"అందుకని-?"

"నీకు కోపం అక్కర్లేదు. నీ ప్రదర్శన అంతా పందులమీద 'పన్నీరు చల్లినట్లుంది."

"అందర్నీ అల్లా అనకూడదు"

ఇలాగే ఎన్నాళ్ళనుండో వాద ప్రతి వాదాలు జరుగుతున్నాయి.

"మీకున్న పరిశోధనా సామర్థ్యాన్ని ప్రదర్శించి మీరు శాస్త్రాభివృద్ధి చేయడం లేదా? మీ శేముషీ ప్రకర్షకి లోకం హర్షించడం లేదా? మీ ప్రయత్నాలకి తగిన దోహదం యీ విశ్వ విద్యాలయం కలిగించడం లేదా? అట్లాగే నాట్యంలో నాకున్న వైదుష్యాన్ని వినియోగించి మహోపయోగాన్ని సాధిస్తాననే విశ్వాసం నాకుంది. నా నాట్యకళకి పోషకమైన విశ్వ విద్యాలయం మీరే. నేను పరిశోధన సలిపే శాస్త్రజ్ఞురాలను" అని తనకూ అతనికీ గల పరిశోధనా సామ్యాన్ని విప్పి చెప్పింది. ఆవిడ వాదబలం చాలా సునిశితం. అతని మెత్తని మనస్సుకి ఈవాదం నూటిగా నాటింది. నిజమే. ఆమె ప్రత్యేకాభిరుచి నరికట్టడానికి తనకేం హక్కు ఉంది? పైగా ఆవిడ అభిరుచుల్ని పోషిస్తానని కూడా మాట యిచ్చాడు పెళ్లి ముందు. సమయం వచ్చినప్పుడు ఆమాట చెల్లించాలి. అతను వ్యవహారజ్ఞానంకల పెద్దమనిషి.

"మహిళా మహలు"లో చేరింది రాణి. సమర్థులు, ప్రసిద్ధి కెక్కిన ఆచార్యులవారు ఆమె నాట్య ధోరణిని శాస్త్ర పక్కీలోకి సరిపోయేటట్టుగా దిద్దుతున్నారు. ఆచార్యులవారుకూడ ఆమెకుగల అభిరుచిని గ్రహించి అచిరకాలంలోనే ప్రవీణురాలినిగా చేశాడు. అపుడపుడు శర్మకూడ ఆవిడ "మహలు"లోని ప్రదర్శనాలు చూసేవాడు. తాను మునుపు భావించిన ఊహాలకి తావిపుడు లేదని తెలిసికొంటున్నాడు. రాణికికూడ అదొక నూతనానుభవము. మహలులోని సభ్యులయెదుట తాను నిర్భయంగా నాట్యం చేయడం మొదట్లోనే అలవాటు చేసుకుంది. ఆవిడ నాట్యకళ ఆ మహలు గోడలలో ఇమిడి ఉండేటట్లు లేదు.

విరిసేముందు గులాబి మొగ్గ (పూవు) ఎంత ఉబలాట పడిపోతుందో! ఎందరెందరిని సువాసనా లహరిలో ముంచి తేల్చుదా మనుకొంటుందో? తీరాచేసి, ఆ సౌరభ సౌఖ్యాన్ని పొందేవారిని చూస్తే, తనలెక్క చాల తక్కువనుకొంటుందా గులాబి.

నాట్యరాణి అనే మొగ్గ వికసించడానికి తరుణం ఆసన్నమైంది. "మహలు" యొక్క ఆర్థికపరిస్థితి ఆశ్టే తృప్తికరంగా లేదు. చందాల వల్ల వసూలయే మొత్తాలే చాల తక్కువ. ఈ విషయం ఆచార్యులవారిని చాల బాధించేది. ఎల్లప్పుడూ సామ్ముచేసే ఉపాయాలు అన్వేషింపబడినా, అన్నీ ఒక్కదానికే దారి తీసేవి. ఒక్క "నాట్యప్రదర్శనం" మాత్రమే. ఎవరి నాట్యం? రాష్ట్రమంతా నాట్యరాణిని గురించి వింటూంది. ఆమె విద్యాకౌశలం, రంజనా చాతుర్యం అందర్నీ ఆకర్షిస్తున్నాయి. "మహలు"వారే ఆమెకొక గౌరవప్రదమైన సన్మానంచేసి ఆవిడకి "నాట్యరాణి" బిరుదు సార్థకమయ్యేటట్లు చేశారు. ఆ సన్మానంలో ఆవిడని నాట్యం ప్రదర్శించమని కోరారు. కాని స్నాతకసభలలో ఆయా పట్టభద్రులు తమతమ కౌశలాల్ని ప్రదర్శించరు కదా! ఆ కారణం పురస్కరించుకొని ఎంతో వినయ విధేయతలతో "నాట్యరాణి" సభ్యుల కోరికను నిరాకరించింది.

తెలివి గలవారందరూ ఆమె సమయస్ఫూర్తికి మెచ్చుకొన్నారు. లేని వారందరూ అహంకారమేమో అని సంశయపడ్డారు.

* * *

"కళాపరిషత్తు"కూడ లలిత కళాకేంద్రమే. "మహిళామహలు" వారికి పోటీ కేంద్రము. పరిషత్తు యజమానులుకూడ కొందరు తమతోను దైనందిన చర్యలలో శీలానికి ప్రాధాన్యం చూపించేటట్టుగా వర్తించేవారు కారు. లలిత

కళని ధనార్జనకే వినియోగించాలని వారివాదం. కళాభ్యాసం చేసేవారి మనోభావాలతో వారికి పనిలేదు. కళారాధకుల గౌరవ ప్రపత్తులంటే వారికి పూచిక పుల్లలు.

ఆ పరిషత్తువారు ఒకసారి నాట్యరాణిమీద కన్ను వేశారు. "రాణి" పేరు అంటే ప్రతి కళాభిమానికి వెర్రి ఎత్తుతోంది. రాణికి కూడ తొలిసారిగా ప్రజాసమక్షంలో నాట్యం చేయాలని ఉంది. కాని ఆపరిషత్తు యాజమాన్యంలో మాత్రం చేయడానికి నిరాకరించింది. దానితో వారికి "చిర్రు" మంది. పచ్చిమిరపకాయ కొరికినట్లయింది. వెంటనే వారి మంట ఉపశమనాన్ని కోరింది.

తనకు విద్య నొసగిన "మహాలు" యొక్క ఆర్థికపరిస్థితిని పెంపుచేయడానికి సంకల్పించింది రాణి. అంతటి మహనీయ కార్యానికి శర్మ కూడా అంగీకరించాడు. ప్రదర్శనానికి కావలసిన ప్రకటనలు మహోధ్వజాయమానంగా జరిగాయి. అసలు నాట్యరాణి ప్రదర్శనానికి ప్రకటన అన్నది అనవసరమే.

ఆనాటి ప్రజానీకం బహూత్సాహ సంతుభితం. ప్రత్యేకంగా "నాట్యరాణి" అంటే అందరికీ గౌరవం మెండు. అందరి నాట్యకత్తెల వంటిది కాదామె. నాట్యమారంభమైనంతనే ప్రజలంతా కిక్కురుమనడంమానేశారు. పరిషత్తు యజమానులూ, యజమానుల అభిమానులూ అందరూ నిర్విణ్ణులయ్యారు. ప్రదర్శనానంతంలో చప్పట్లు మిన్నుముట్టాయి. అప్పటికి కూడ నాట్యరాణి అలసినట్లు లేదు. ఏదో నూతనోత్సాహ మామెనావేశించింది. టైం ప్రకారం, ప్రోగ్రాం ప్రకారం ప్రదర్శనమైపోయినా, ఇంకా నాట్యం చేయాలనే ఉన్నదామెకు.

ఆమె అభిమాన ప్రేక్షక వర్గంలో యువక సమూహం కూడ ఆమె ఇంకా తమ యెదుటనే వేదికపై ఉండాలని అనుకొంటున్నారు. "ఇంకొక్కసారి డాన్సుచేయమని అడిగితే?" అనుకొంటున్నారు వారంతా. వారిలో ధీరనాయకుడొకడు లేచి యువ సమూహం కోరికను మన్నించాలని విన్నవించాడు. అయిదు నిమిషాలయింది. తెరలో సంప్రతింపులు జరుగుతున్నాయి. కళాపరిషత్తు సభ్యుడొకడు కూడా ఆకోరికని బలపరిచాడు. పరిషత్తువారిని మన్నించవలసిందేనా? లేకపోతే యువక సమూహమంతా నిరుత్సాహ పడిపోతారు. తరువాత కట్టతెగిన యేరులాగ వారేం చేయగలరో ఎవరికి తెలుసు? "నాట్యరాణి" యువ సమూహం కోరికని మన్నించిందని ప్రకటించారు. పై చెప్పిన పరిషత్సభ్యుడు బైటికి వెళ్ళి మళ్ళీవచ్చాడు రెండోసారి నాట్య ప్రదర్శనం చూచేందుకు. ఒక చెక్కెరకేళీ పండు తింటూ ఇంకొకటి చేత్తో పట్టుకున్నాడు. "నాట్యరాణి" తెరమరుగునుంచి వచ్చి వేదిక నలంకరించించింది. మునుపటికన్న ద్విగుణితోత్సాహంతో తదేక ధ్యానంతో ప్రదర్శనాన్ని నిర్వహిస్తోంది. వేదికమీది దీపాలు తప్ప సభా మండపంలో దీపాలు లేవు. అదిగో ఎగిరి గంతేసింది "రాణి". మళ్ళా గంతబోయింది. కాలు చర్రునజారింది. మనిషి వేదికపై వ్రాలింది. స్పృహలేదు. తానెగిరినపుడు పీల్చినయూపిరిగాలికి బిగించిన కంచుకం చిట్లింది. తెర వ్రాలింది. హాలంతా దీపాలే! అంతా ఒకటే గోల. పరిశీలించేసరికి, వైద్యులు చెప్పారు, కుడిపాదం సీలమండ స్థాన భ్రంశం చెందినదట. ఆమె యింక నాట్యం చేయడానికి వీలు లేదట.

దంపతుల అనుతాపానికి మేరలేదు. ఆవారంలోనే శర్మకి అంతర్జాతీయ శాస్త్రవేత్తలు తన పరిశోధన ఫలితాలను గుర్తించి అవి శాస్త్రాభివృద్ధికి చేసిన తోడ్పాటును ప్రశంసిస్తూ అతనికి "డాక్టరేట్" ఇచ్చినట్లు వార్త వచ్చింది. తాత్కాలికంగా అతని ఆనందానికి మేర లేకపోయింది. రాణి కూడా అమితానంద పరవశ అయ్యింది. కాని రాణికి సంభవించిన శాశ్వతమైన అవరోధం మాత్రం వారి నిరువురినీ శోకాంబుధిలో ముంచింది.

"చివరి వరకూ కూడా, ప్రజామనోరథాల్నే మన్నించావు రాణీ! నీవేధన్యురాలవు" అని అభినందించాడు శర్మ.

"చాలులెండి. మీరు నన్ను అలా పొగడకూడదు. మీకు కలిగిన గౌరవానికి దేవుడికి నా కృతజ్ఞతని తెలుపుకొంటున్నాను" అన్నది నాట్యరాణి, చెమ్మగిల్లిన నయనాలతో.